క్లుప్తంగా

బీజేపీ నాయకుల ప్రచారం ప్రారంభం

నారాయణపేట రూరల్: తనకు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూయిస్తానని బీజేపీ అభ్యర్థి రతంగపాండురెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని దళితవాడలోని కన్రెమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం జలాల్‌పూర్, బైరంకొండ, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్‌లకు అవకాశం ఇచ్చారని, ఒకసారి బీజేపీ పాలన రుచి చూడాలని కోరారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ దోచుకుని తిన్నదని, అదే తీరులో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిని పెంచి పోషించిందన్నారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్, నందునామాజి, లక్ష్మి, మహబూబ్ అలీ, ఆశప్ప పాల్గొన్నారు.

బీజేపీలోనే కొనసాగుతా..

బీజేపీ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యాయాదవ్ పట్టుపీడారు. టికెట్ రాకపోవడంతో అలిగిన ఆయన కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారనే ప్రచారం జోరుగా జరిగింది. సోమవారం కార్యకర్తలు, తన అభిమానులతో సమావేశం నిర్వహించారు. చివరికి అందరి అభిప్రాయం మేరకు పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ సూచించిన విధంగా రతంగపాండురెడ్డి విజయానికి కృషి చేస్తానని పత్రిక ప్రకటన విడుదల చేశారు.

కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

నారాయణపేట రూరల్: హైదరాబాద్‌లోని కేశవ్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ కరాటే, కుంఫ్యూ చాంపియన్‌షిప్ 2023లో పట్టణానికి చెందిన మైనార్టీ గురుకుల విద్యార్థులు పాల్గొన్నారు. కార్తీక్ గోల్డ్‌మెడల్, సమీర్, ఉమర్, ఫారుక్‌లు సిల్వర్ మెడల్స్, మహేష్, విక్రమ్, నరహరి, స్టీఫెన్, హర్షవర్ధన్‌లు కాంస్య పతకాలు సాధించారు. ప్రిన్సిపాల్ ఖాజామహబూబ్‌ఖాన్, సిబ్బంది ఖాసీం ఉస్సేన్, అబ్దుల్ సలీం, శివకుమార్, పంకజ్, నల్లారెడ్డి, ఫయాజ్, నారాయణ అభినందించారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డుకు సోమవారం వరి ధాన్యం పోటెత్తింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద వేసిన వరి పంటలు కోతలు ప్రారంభం కావడంతో రైతులు పెద్ద ఎత్తున ధాన్యంను అమ్మకానికి తెస్తున్నారు. మార్కెట్‌కు దాదాపు పది వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. సోనామసూరి ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 2273, కనిష్టంగా రూ. 1850 గా ధరలు నమోదు అయ్యాయి. హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1859, కనిష్టంగా రూ. 1511 గా ధరలు లభించాయి. ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 5329 గా ఒకే ధర వచ్చింది.

విజయంతం చేయండి

మక్తల్: పట్టణంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటిశ్రీహరి పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు యల్లమ్మకుంటలో సభ ఉంటుందన్నారు. నియోజకవర్గ ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, నాగరాజుగౌడ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంటిమెంట్ కొనసాగేనా?

అచ్చంపేటలో గెలిచిన పార్టీదే అధికారం

- 12సార్లు ఇక్కడ గెలుపొందిన పార్టీనే ప్రభుత్వ ఏర్పాటు
- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పార్టీలు
- ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు

అచ్చంపేట: అచ్చంపేట నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం సెంటిమెంట్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా ఈ సెంటిమెంట్ కొనసాగుతోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోటాపోటీగా ప్రచారాలు మొదలుపెట్టాయి. స్థానికంగా ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుందన్న చర్చ ప్రారంభమైంది. అచ్చంపేట ఫలితాలపై అందరిలో ఆసక్తి నెలకొంది.

1962లో నియోజకవర్గం ఏర్పాటు..

1307 ఫసలీలో అమ్రాబాద్ తాలూకాగా ఉండేది. 1322 ఫసలీలో అచ్చంపేటకు మార్చారు. 1952, 1957 అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ద్విసభ్య నియోజకవర్గాలతో అచ్చంపేట కలిసి ఉన్నది. 1962లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేశారు. మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున కె.నాగన్న ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గ పునర్విభజనలోనూ ఎస్సీలకే రిజర్వు అయింది. అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, వంగూరు మండలాలు పూర్తిగా అచ్చంపేట సెగ్మెంట్‌లోకి వచ్చి చేరాయి. పదర, చారకొండ కొత్త మండలాల ఏర్పాటుతో మొత్తం 8 మండలాలుగా నియోజకవర్గం ఉంది. 1962 నుంచి ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరిగితే.. 12సార్లు ఇక్కడ గెలిచిన పార్టీయే అధికారం చేపట్టింది. 2009లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తే.. ఇక్కడ మాత్రం టీడీపీ అభ్యర్థి పి.రాములు గెలుపొందడంతో చరిత్రకు గండి పడింది. 2014, 2018లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీకి ఇక్కడ పట్టం కట్టడంతో సెంటిమెంట్ కొనసాగుతోంది. ఇంతవరకు హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యేలు లేకపోవడం విశేషం.

వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధ్యానం..

అచ్చంపేట ఓటర్లు వ్యక్తుల కంటే పార్టీలకే ప్రాధాన్యమిస్తున్నారు. 1962 నుంచి 2018 వరకు జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీలకే ఓటర్లు పట్టం కట్టారు.6సార్లు కాంగ్రెస్, 5సార్లు టీడీపీ, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ విజయం సాధించాయి. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన మహేంద్రనాథ్ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు.



అచ్చంపేట పట్టణ వ్యూ

అత్యధిక.. అత్యల్ప మెజార్టీ




ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా 46,181 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా 2,609 ఓట్ల మెజార్టీ నమోదైంది. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన పి.రాములు 46,181 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీచేసిన డి.కిరణ్‌కుమార్ 2,609 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

1962 నుంచి 2018 వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు..

సంవత్సరం	పేరు	పార్టీ	మెజార్టీ
1962	కె.నాగన్న	కాంగ్రెస్	5,433
1967	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	12,502
1972	పి.మహేంద్రనాథ్	కాంగ్రెస్	17,686
1978	ఆర్ఎం మనోహర్	కాంగ్రెస్.ఐ	9,310
1983	పి.మహేంద్రనాథ్	టీడీపీ	10,316
1985	మహేంద్రనాథ్	టీడీపీ	34,445
1989	డి.కిరణ్‌కుమార్	కాంగ్రెస్	2,609
1994	పి.రాములు	టీడీపీ	46,181
1999	పి.రాములు	టీడీపీ	12,346
2004	వంశీకృష్ణ	కాంగ్రెస్	20,665
2009	పి.రాములు	టీడీపీ	5,101
2014	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	11,821
2018	గువ్వల బాలరాజు	టీఆర్ఎస్	9,556

ఓటర్ల వివరాలు..

పురుషులు:	మహిళలు:	
1,17,124	1,16,439	
ఇతరులు: 2	సర్వీస్ ఓటర్లు: 173	మొత్తం: 2,33,738
పోలింగ్ కేంద్రాలు: 265		



2018 ఎన్నికల్లో..

గువ్వల బాలరాజు (టీఆర్ఎస్): 87,841	చిక్కుడు వంశీకృష్ణ (కాంగ్రెస్): 78,285
మేడిపల్లి మల్లేష్ (బీజేపీ): 3,196	నోటా: 2,403

భౌగోళికంగా..

అచ్చంపేట నియోజకవర్గం జిల్లాలోనే చాలా పెద్ది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం 2611.39 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉంది. ఇందులో 2166.37 చదరపు కి.మీ. అభయారణ్యం, 445.02 చదరపు కి.మీ. బఫర్ జోన్‌గా ఏర్పాటు చేశారు. ప్రసిద్ధి చెందిన ఆలయాలు, అరుదైన వన్య ప్రాణులు, వనమూలికలు, అటవీ ఉత్పత్తులు, సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి.

బీసీలు, ఎస్సీలే కీలకం..

నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ ఓటర్లు గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. కులాల వారీగా పరిశీలిస్తే.. 2,33,565 మంది ఓటర్లలో ప్రధాన సామాజిక వర్గాలైన ఎస్సీలు 60వేలు, బీసీలు లక్ష 15వేలు, ఎస్టీలు 32వేలు, రెడ్డి, వైశ్యులు 20వేలు, ముస్లిం, మైనార్టీలు 7వేల మంది ఓటర్లు ఉన్నారు.

స్థానికేతరులకే పట్టం..



పుట్టపాగ మహేంద్రనాథ్

అచ్చంపేట నియోజకవర్గానికి మరో ప్రత్యేకత ఉంది. నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు ఎక్కువగా స్థానికేతరులే ఉన్నారు. మొత్తం 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే.. 10సార్లు స్థానికేతరులు ఎన్నిక కావడం విశేషం. 1994, 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే స్థానికులైన పి.రాములు, చిక్కుడు వంశీకృష్ణలు ఎన్నికయ్యారు. 1962లో కె.నాగయ్య, 1978లో హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎం మనోహర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1967, 1972, 1983, 1985 ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన పుట్టపాగ మహేంద్రనాథ్ ఎన్నిక కాగా, 1989లో నాగర్‌కర్నూల్ మండలం శాయిన్‌పేటకు చెందిన డి.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. 2009లో చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో అచ్చంపేట సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే పి.రాములు స్వగ్రామమైన గుండూరు.. కల్వకుర్తి నియోజకవర్గంలోకి చేరడంతో ఆయన స్థానికేతరుడు అయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో గెలిచిన గువ్వల బాలరాజుది వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొల్కెపహాడ్ గ్రామం.

2009లో అప్పాపూర్‌లో పోలింగ్ బూత్..

నల్లమల అభయారణ్యంలోని అప్పాపూర్ చెంచుపెంటలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో 180/182ను పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో 12 చెంచుపెంటలకు చెందిన గిరిజనులు మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

సాధారణ ప్రజలపై డీఎస్పీ అత్యుత్సాహం



బస్టాండ్ నుంచి బస్ దిగి వస్తున్న సాధారణ ప్రజలను తోసేస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: సీఎం సభ పేరుతో రోడ్డుపై వెళ్తున్న సాధారణ ప్రజలను ఇబ్బందులు పెడుతున్న ఓ పోలీసు అధికారి ఫొటోలు చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై అనుచితంగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసేందుకు వచ్చి రోడ్డుపై నిల్చున్న సాధారణ ప్రజలపై నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ ఓవర్ యాక్షన్ చేశారు. వీఐపీ గేట్ వద్ద విధుల్లో ఉన్న ఆయన రోడ్డుపై వెళ్తున్న సాధారణ జనంతోను అనుచితంగా ప్రవర్తించారు. వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చి బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన వారిని మహిళలు, వృద్ధులు చూడకుండా కానిస్టేబుళ్లతో తోయించడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అక్కడే విధుల్లో ఉండి ఫొటోలు తీస్తున్న జర్నలిస్టులతో అనుచితంగా వ్యవహరించారు. దూరంగా నెట్టివేయడంతో పాటు ఫొటోలు తీస్తుంటే సెల్‌ఫోన్ లాక్కొని హల్‌చల్ సృష్టించారు. నా ఫొటోలు తీస్తావా.. పోలీసులు అంటే భయం లేదా అంటూ కోపోద్రిక్తులయ్యారు. భద్రత పేరుతో ఇష్టారీతిగా వ్యవహరించిన డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా వాస్తవానికి సీఎం సభ అనంతరం శ్రీసత్యనారాయణ చౌరస్తా నుంచి సింగారం క్రాస్‌రోడ్డు వరకు తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యింది. ప్రణాళిక బద్ధంగా ట్రాఫిక్ కానిస్టేబుళ్ల నియామకం చేపట్టక పోవడంతో వాహనాలు ఇష్టారీతిగా వెళ్లడంతో గంట పాటు ట్రాఫిక్ నిలిచింది. సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కేసీఆర్ సభకు తరలిన నాయకులు



మరికల్ నుంచి కేసీఆర్ సభకు తరలివెళ్తున్న పార్టీ నాయకులు

నారాయణపేటలో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు జిల్లా వ్యాప్తంగా సోమవారం అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాలలో డప్పుల మోతలతో, పటాసులు కాల్చుతూ ఊరేగింపుగా బయలుదేరారు. – సాక్షి, నెట్‌వర్క్

రాష్ట్ర ప్రజలు తలెత్తుకునేలా వ్యవహరిస్తా..

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



మాట్లాడుతున్న గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ప్రజలు తలెత్తుకునేలా చేయడంతో పాటు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తన వంతు కృషి చేస్తానని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలో ఫంక్షన్‌హాల్‌లో పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పౌరసన్మానం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశాన్ని శక్తివంతంగా మార్చే ఆలోచనా విధానంతో ముందుకు సాగుతుందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పేదలకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు అందించే సంక్షేమ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరు పరిశీలించే బాధ్యత నాపై ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు గర్వపడేలా తన పదవికి వన్నె తెస్తానని గవర్నర్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున శాలువాలు, గజమాలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, అభిలాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక ఇక్కట్లు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ బస్సులు సరిపడ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరు అవుతుండటంతో చుట్టుపక్కల మండలాలు, గ్రామాల ప్రజలను తరలించడానికి ఆర్టీసీ బస్సులను బుక్ చేయించుకున్నారు. ఒక్క నారాయణపేట డిపో నుంచే ఏకంగా సీఎం సభకు 35 బస్సులు తరలివెళ్లడంతో విద్యార్థులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారిపై ఉన్న గ్రామాలకు విద్యార్థులు కిక్కిరిసి వెళ్తే, చిన్నారులు ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించారు. చాలా వరకు బస్సులు గ్రామాలకు రాక విద్యార్థులు పాఠశాలలకు వెళ్లని పరిస్థితి నెలకొంది. సోమవారం చాలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల్లో హాజరుశాతం సైతం తగ్గింది.

కర్ణాటకకు తరలుతున్న వరిధాన్యం



హిందుపూర్ శివారులో రైతుల పొలాల వద్ద ధాన్యం కొంటున్న రాయచూర్ వ్యాపారులు

- రాష్ట్ర ప్రభుత్వ మద్దతు ధర తక్కువగా ఉండడమే కారణం
- రాయచూర్ మార్కెట్‌లో సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2450

కృష్ణా: జిల్లాలోనే అతి ఎక్కువగా వరి సాగు చేసిన మండలం కృష్ణా. ఇక్కడ పండే ధాన్యంకు విలువ ఎక్కువ. అందుకే పక్కన ఉన్న కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్ వారు, మిల్లర్లు ఈ ప్రాంత రైతుల పొలాల్లోకి వచ్చి ధాన్యాన్ని కొంటున్నారు. అందులో ప్రభుత్వం అందించే మద్దతు ధర అతి తక్కువగా ఉండడంతో రైతులు ప్రైవేట్ మిల్లర్లకు అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు.

12వేల ఎకరాల్లో సాగు

మండలంలో ఈ ఏడాది 12వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 29 క్వింటాళ్లు అనుకున్నా మొత్తం మండలంలో 32వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించినట్లు వ్యవసాయ అధికారుల అంచనా. కాగా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు వీటిలో కనీసం 5 శాతం ధాన్యం కూడా వచ్చే అవకాశం లేదని చెప్పవచ్చు. గతేడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు కేవలం 16వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర, ప్రైవేట్ మిల్లర్లు ఇచ్చే ధర కూడా సమానంగా ఉన్నప్పుడే ఆ పరిస్థితి ఉన్నది. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధరకు, మిల్లర్లు ఇచ్చే ధరకు క్వింటాల్‌కు కనీసం రూ.500 తేడా ఉంది.



తెలంగాణ సరిహద్దులోని చెక్‌పోస్టు నుంచి కర్ణాటకకు వెళ్తున్న వరి ధాన్యం

అంటే రైతులు మిల్లర్లకు ఇవ్వడం వల్లా వారికి అదనంగా రవాణా, హమాలి, ఇతర ఖర్చులు కూడా మిగులుతున్నాయి.

ప్రతి రోజు 90 టన్నుల ధాన్యం కర్ణాటకకు

ప్రతి రోజు సరిహద్దులోని చెక్‌పోస్టు నుంచి వరి ధాన్యంకు సంబంధించి లారీలు 30 దాకా వెళ్తుంటాయి. ఒక్కో లారీలో 30 టన్నులు లెక్క మొత్తం 90 టన్నుల ధాన్యం వెళ్తుంది. వారం రోజుల నుంచి రాయచూర్‌కు వెళ్తున్నాయి. ఇప్పటికే 720 టన్నుల ధాన్యాన్ని తరలించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశంను నిర్వహించి వారంలో ఏర్పాటు చేసేందుకు సూచించినట్లు సమాచారం. కేంద్రాలు ప్రారంభించే సమయానికి దాదాపు మరో 700 నుంచి 800 టన్నుల ధాన్యం తరలివెళ్తుంది. ఈ ధాన్యం కేవలం మాగనూర్, కృష్ణా మండలాలే కాదు పక్కన ఉన్న మక్తల్, నర్వ, ఉట్కూర్, మరికల్, నారాయణపేట, దేవరకద్ర మండలాలకు చెందిన వరి ధాన్యం లారీలు వెళ్తుంటాయి. ఏదిఏమైనా ఇలా రాష్ట్రానికి చెందిన వరి ధాన్యం కర్ణాటకకు తరలివెళ్తుంటే నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంపై వ్యవసాయ, మార్కెట్ అధికారులు ప్రత్యమ్నాయం ఆలోచించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పొలాల వద్దే కొంటున్నారు



కర్ణాటకలోని రాయచూర్ మార్కెట్ మిల్లర్లు మా పొలాల వద్దకు వచ్చి, ఎక్కువ ధర ఇవ్వడం వల్లా మేము వారికే విక్రయిస్తాం. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర తక్కువగా ఉంటుండడంతో పాటు అదనపు ఖర్చులు కూడా ఉన్నాయి. అందుకే మేం గతేడాది నుంచి కూడ మిల్లర్లకే విక్రయిస్తున్నాం. నా ధాన్యం మొత్తం మిల్లర్లకు విక్రయిస్తున్నాను.
– ఖుషప్ప, రైతు, హిందుపూర్

డబ్బులు వెంటనే ఇస్తారు

మిల్లర్లు ప్రభుత్వం కంటే అధిక ధరలు ఇవ్వడంతో పాటు డబ్బులను వెంటనే ఇస్తున్నారు. పైగా మాకు రవాణా, హమాలీ ఖర్చులు కూడా మిగులుతున్నాయి. అందుకే మేము మిల్లర్లకు ఇస్తున్నాం.
– మార్కండేయ, రైతు, హిందుపూర్

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం



మండలంలో మొత్తం ఐదు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారం లోపు ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కర్ణాటకలో సన్నరకం ధాన్యంకు మేము ఇచ్చే ధరలకంటే ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే రైతులు ప్రైవేట్‌గా అమ్మేందుకు మొగ్గ చూపుతున్నారు.
– సుదర్శన్‌గౌడ్, వ్యవసాయ అధికారి, కృష్ణ

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం మూకుమ్మడిగా పార్టీకి రాజీనామాలు చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీలో 30ఏళ్లుగా ఉంటూ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసినా తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. పార్టీలో ఇంకా కొనసాగితే భవిష్యత్ అగమ్యగోచరంగా ఉండేలా ఉందని భావించి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు మాజీ జెడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ వైస్ ఎంపీపీ భగవంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు దేవరకద్ర రాందాసు, చిన్నచింతకుంట వెంకటేశ్వర్‌రెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బాల్‌చందర్‌గౌడ్, ఎంపీటీసీ శివరాజు, ఫసియొద్దీన్, కావాలి అశోక్‌గౌడ్, రంజిత్‌గౌడ్, క్రాంతిగౌడ్ తదితరులు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

కేసీఆర్ సమక్షంలో గులాబీ గూటికి..

దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ తన మద్దతుదారులతో కలిసి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

బీజేపీలోకి కొండా ప్రశాంత్‌రెడ్డి..

దేవరకద్ర రూరల్: దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కొండా ప్రశాంత్‌రెడ్డి సోమవారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ అధికార ప్రతినిధి ప్రకాష్‌రెడ్డిల సమక్షంలో ప్రశాంత్‌రెడ్డి పార్టీలో చేరారు. కాగా పార్టీ కోసం ఎంతో కృషి చేసినా కనీస విలువ ఇవ్వలేదని, సరైన గుర్తింపు, గౌరవం లేనిచోట ఉండలేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి పంపించిన లేఖలో ఆయన పేర్కొన్నారు. దేవరకద్ర నుంచి బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌పై స్పష్టమైన హామీ ఇవ్వడంతోనే ఆయన తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరినట్లు తెలుస్తోంది.



బీజేపీలో చేరుతున్న కొండా ప్రశాంత్‌రెడ్డి

అధికారంలోకి రావడం ఖాయం



పారుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పారుపల్లి, రాంపూర్, గార్లపహాడ్, దమాయపల్లి, అభంగపట్నం, కనాయపల్లి, లింగుపల్లి, గంగ్యానాయక్ తండాల్లో అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యాసాగర్, జి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గడప గడప ప్రచారం

మరికల్: కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికరెడ్డిని గెలిపించాలని నాయకులు గడప, గడప ప్రచారం చేశారు. సోమవారం మండల కేంద్రంలో బొడ్రాయి విగ్రహానికి పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకలను అమలు చేసి తీరుతామన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లి, ఆచార్యపూర్‌లో గ్రామాల్లో సోమవారం వరి కొనుగోలు కేంద్రాలను డీపీఎం చెన్నయ్య ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే వరిని విక్రయించాలని అన్నారు. ఏపీఎం విజయకుమారి, సీసీ మల్లేష్, భద్రినాయక్, కవిత, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.